

# నేను - నా నవలలు
## సూర్యదేవర రామ్ మోహన్‌రావు



1985లో 'మోడల్' నవలతో తెలుగు నవలా ప్రపంచంలో రచయితగా అడుగుపెట్టిన రామ్ మోహనరావుగారు మొదటి నవలతోనే సంచలన రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత వ్రాసిన ప్రతి నవలకీ ఒక వైవిధ్య భరితమైన నేపథ్యాన్ని ఎన్నుకుని, ప్రతి కథాంశం మీద ఎన్నో పరిశోధనలు చేశారు. చరిత్రనీ, వాస్తవాలనీ, విశ్లేషణనీ, కల్పననీ సమపాళ్ళలో రంగరించి 'ఇన్వెస్టిగేటివ్ ట్రెండ్ సెట్టర్'గా తెలుగు నవలా పాఠకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈయన నవలలు ఇతర భారతీయ భాషల్లోకి అనువదించబడి అన్ని చోట్లా సంచలనం సృష్టించడం మరో విశేషం. ఇంతవరకూ 92 నవలలు వెలువరించి అతి త్వరలోనే వందవ నవల మైలురాయిని చేరబోతున్న శ్రీ సూర్యదేవర నిరంతర అన్వేషి, నిత్య పరిశోధకుడు, విలక్షణ రచయిత. వారి నవలల వెనుకనున్న కృషినీ, అందుకోసం ఆయన చేసిన ఆసక్తికరమైన పరిశోధనా విశేషాలనీ నెలనెలా 'కౌముది' పాఠకులతో పంచుకోబోతున్నారు. ఇది ఆయన కేవలం 'కౌముది' కోసమే వ్రాస్తున్న ప్రత్యేక శీర్షిక..!

### ఈ ఫీచర్ జననం

ఈ మధ్యనే కౌముది పత్రిక సంపాదకులు నాకు అతి సన్నిహితంగా పరిచయమయ్యారు.

కిరణ్‌ప్రభగారు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి నడుపుతున్న కౌముదిని చూసి ఇంప్రెస్ అయి, నేను మీ పత్రికకి ఏదైనా రచనా సహాయం చేయగలనా అని అడిగాను.

అప్పుడాయన అడిగింది విని ఆనందోద్వేగానికి లోనయ్యాను.

మానవ మనస్తత్వాల మీద, వారి భావోద్వేగాలమీద, సాంఘిక, కుటుంబ పరిస్థితులపై నవలలు రాసే వాళ్ళకు విషయ సేకరణ, పరిశోధన, సంబంధిత ప్రాంతాలకు వెళ్ళే అవసరం లేదు.

నా రచనలు ప్రధానంగా ఏదో ఒక రంగాన్ని ఎన్నుకుని, దానికి సంబంధించిన వివరాలు సేకరించాకే మొదలవుతాయి.

పరిశోధన, వివరాల సేకరణలో చాలా శ్రమ పడతాను. ఎవరినైనా కలుస్తాను. ఎంత దూరమైనా వెళతాను.

మీరు నవలలు రాసే నేపథ్యాల గురించి ఒక ఫీచర్ రాయమని కిరణ్‌ప్రభగారు అడగటంతో అనుభూతికి లోనయ్యాను. ఇప్పటి వరకు ఒక్కో నవల రాయటానికి ఎంత శ్రమపడింది, ఎవరెవర్ని కలిసింది, ఏ ఏ ప్రాంతాలకు వెళ్ళింది.... మిత్రులకు చెప్పి తృప్తిపడేవాడిని... దానిమీదే ఒక ఫీచర్ రాస్తే బావుంటుందని కిరణ్‌ప్రభగారు చెప్పేవరకు నాకా ఆలోచనే రాలేదు.

ఈ ఫీచర్ రాయటానికి కిరణ్‌ప్రభగారే ప్రేరణ.

# ప్రారంభం

**నాలుగు దశాబ్దాల** క్రితం పశ్చిమ పర్వత అటవీ శ్రేణుల్లో ఒక జ్వాల ఉద్భవించింది. ఆ జ్వాలకో నేపథ్యం ఉంది. ఆ నేపథ్యంలో వేదనుంది. రోదనుంది... సాహసముంది.. రాక్షస సత్యముంది... రక్తపాతముంది... అమానుషం ఉంది... స్వార్థ రాజకీయనాయకుల హస్తముంది.

ఆ జ్వాల అమానుష ఉధృతికి లక్షలాది గంధం చెట్లు నేలకొరిగాయి. వేలాది గజరాజులు దంతాలతోపాటు, ప్రాణాలు కోల్పోయాయి.

అడవి తల్లి కోల్పోయిన సంపద కరెన్సీ కట్టల్లోకి మారిపోయింది.

అడుగో వీరప్పన్.... ఇడుగో వీరప్పన్... మాకక్కడ కనిపించాడని కొందరు, మాకిక్కడ కనిపించాడని ఇంకొందరు... ఎక్కడ ఎవరికి కనిపించినా, చట్టానికి మాత్రం మూడు దశాబ్దాలకు పైగా పట్టుబడలేదు. ఇక్కడే.. ఇలాంటి మజిలీల్లోనే నేరస్తుడు, ఉగ్రవాది, మాఫియా నాయకుడు సయితం ప్రజల దృష్టిలో అద్భుతమైన వ్యక్తిగా రూపుదిద్దుకుంటాడు.

అతన్ని హీరో వర్షిప్‌తో ఆరాధిస్తుంటారు, అభిమానిస్తారు, ప్రేమిస్తారు.

ఇలా జరగటం సమాజ క్షేమానికి భంగకరమే. చట్టబద్ధ వ్యవస్థలు విఫలమయినప్పుడు ఇలా జరుగుతుంది.

## రక్తచందనం నవల (1992)




తమిళనాడు, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాల్ని కొన్ని దశాబ్దాలపాటు గడగడలాడించి, కన్నడ సూపర్ స్టార్ కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్‌ని కొన్ని నెలలకు పైగా అడవిలో బంధించిన అడవిదొంగ వీరప్పన్ చేసింది దారుణమైన నేరాలే అయినా, అతను ఎప్పటికప్పుడు ఇటు పోలీసులకి, అటు ఫారెస్ట్ సిబ్బందికి, ఆ పైన బి.ఎస్.ఎఫ్‌కి కూడా దొరక్కుండా దేశవ్యాప్తంగా విశేషమైన సంచలనమే సృష్టించాడు.

వీరప్పన్ ప్రతినాయకుడే అయినా కథా నాయకుడంత ఇమేజ్‌ని సొంతం చేసుకోవటంతో అతని చుట్టూ వాస్తవాలతోపాటు ఎన్నో కల్పనలు, సాహసకృత్యాలు, ఊహాగానాలు అల్లుకుపోయి అతనో పెద్ద టాపిక్‌గా మారిపోయాడు దేశవ్యాప్తంగా.

సరిగ్గా అలాంటి నేపథ్యంలో రాజా చందూర్ అనే రచయిత బెంగుళూరు నుంచి హైదరాబాద్ కారులో వచ్చాడు. నా నుంచి, నా నవలల హక్కులు తీసుకుని కన్నడంలోకి అనువదించేందుకు. వచ్చేప్పుడు తనతో పాటు మైసూర్‌కి చెందిన సుధాకర్ భండారీ, నంజన్‌గడ్‌కి చెందిన విజయ్ అనే తన మిత్రుల్ని సరదాగా తనకు తోడుగా తీసుకు రావటం జరిగింది. కొద్దికాలంలోనే వాళ్ళతో నాకు మంచి అనుబంధం ఏర్పడింది.

వారి తిరుగు ప్రయాణంలో నేను వారితో కలిసి బెంగుళూరు, అక్కడి నుండి మైసూర్ వెళ్ళాను.

వీరప్పన్ గురించి నవల రాయమని, ఇంతవరకు ఎవరు రాయలేదని, వీరప్పన్ జీవన విధానం మంచి నవలా వస్తువవుతుందని పదే పదే చెప్పసాగాడు మిత్రుడు బండారీ. ఇతనికి విజయ్ తోడయ్యాడు.

వీరప్పన్‌ది నేరపరమైన నేపథ్యమే అయినా, అతను తప్పించుకునే విధానాలు, ఏనుగుదంతాలు, గంధం, రక్తచందనం లాంటి విలువైన అటవీ సంపదను ఎలా తరలించి సొమ్ము చేసుకుంటున్నది కళ్ళకు కట్టినట్లు వాళ్ళిద్దరు చెప్పటంతో ఆ నేపథ్యంతో తప్పని సరిగా నవల వ్రాయాలనే నిర్ణయానికి వచ్చాను. అప్పట్లో మైసూర్ నుంచి వెలువడే మైసూర్ మిత్ర, మైసూర్ టైమ్స్ దిన పత్రికలు వీరప్పన్ గురించి చాలా వివరాలు ప్రచురించటం జరిగింది.

ఆ రెండు దినపత్రికల కెళ్ళి వాళ్ళ దగ్గరున్న సమాచారాన్ని పూర్తిగా సేకరించి, విజయ్‌తో కలిసి మైసూర్ నుంచి కొల్లెగాళ్ అనే టౌన్‌కి, అక్కడి నుంచి అడవి మధ్యలో ఉండే మలై మహాదేశ్వరాహిల్స్ అనే పెద్ద గ్రామానికి బయలుదేరాను.

దిట్టమైన అడవుల మధ్యనుంచి ప్రయాణం... సాయంత్రం ఆరయితే కొల్లెగాళ్ నుంచి ఏ వాహనాన్ని మలై మహదేశ్వర్ హిల్స్‌కి వెళ్ళేందుకు అనుమతించరు.

నవల రాయాలనే ఉద్వేగం, ఉత్సాహంతో నిండా మునిగి ఉన్న నేను మారుమూల అటవీ ప్రాంతాల్లోకి వెళ్ళటానికి భయపడలేదు. కాని విజయ్ మాత్రం నెర్వెస్‌గానే ఉన్నాడు.

కొళ్ళెగాళ్‌లో లాస్ట్ బస్ ఎక్కాం. చలిగాలులు, సన్నటి వర్షం, నిశీధిలో మునిగిపోయి ఉన్న దట్టమైన అడవి... ఆ రాత్రి ప్రయాణం




ప్రమాదాల్లోకి వెళుతున్నట్లుగానే ఉంది. రాత్రి పదిన్నర గంటలకి మలై మహదేశ్వర హిల్స్‌కి చేరుకుని, వెంటనే పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి షకీల్ అహ్మద్ అనే ఎస్.ఐ.ని కలిశాం. (కొన్ని నెలల తర్వాత ఇతన్ని వీరప్పన్ ఒక ఎటాక్ లో చంపాడు). షకీల్ అహ్మద్ కంగారు పడిపోయి, 'వీరప్పన్ తన అనుచరులతో ఈ అటవీ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాడు. ఈ గ్రామంనుంచే వంట సరుకుల్ని తరలించే ప్రయత్నంలో ఉన్నాడు. ఆ సందర్భంలో పోలీస్ స్టేషన్ మీద ఎటాక్ జరిగినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మీరు ఇక్కడుంటం క్షేమంకాద'ని, భోజనం చేయగానే రహస్యంగా మమ్మల్ని తీసుకెళ్ళి ఓ పశువుల పాకలో ఆ రాత్రికుండే ఏర్పాట్లు చేశాడు.



ఇది కథ కాదు - జరిగిన కథ అంతకంటే కాదు ప్రస్తుతం జరుగుతున్న ఓ యథార్థగాథ. పరిశోధన లతో పదునెక్కిన కలం పటిష్ఠంగా చిత్రించిన యథార్థ జీవన వ్యథార్థ దృశ్యం. అందాల చందనాన్ని మొద లంటా నరికి మదగజాల దంతాల్ని నిర్దాక్షిణ్యంగా పెరికి తుపాకి గుళ్ళతో అడవిని శాసించే నియం [illegible]త్వం మోహరించిన సైన్యాన్ని సైతం మోసగించి తప్పించుకునే ఊహాతీత వ్యూహాల దుస్సాహస దౌర్జన్యం. 'స్వాతి' వార పత్రికలో 37 వారాల పాటు అపూర్వ సంచలనం సృష్టించిన యథార్థగాథ. మూడు రాష్ట్రాల అటవీ శాఖల్ని, పోలీసు డిపార్ట్‌మెంట్స్‌ని, రిజర్వ్ పోలీస్ దళాల్ని ముప్పతిప్పలు పెడుతున్న అడవిదొంగ వీరప్పన్‌పై పరిశోధనాత్మక రచన

ఇన్వెస్టిగేటివ్ ట్రెండ్ సెట్టర్,
యువతకు స్ఫూర్తి ప్రధాత
సూర్యదేవర రామ్ మోహన్ రావు
[illegible]ం నుంచి జాలువారిన మరో అత్యద్భుత సంచలనాత్మక నవలా ఆణిముత్యం

'రక్తచందనం'
'రక్తచందనం'
'రక్తచందనం'

రాత్రంతా దుర్భర పరిసరాల్లో బిక్కు బిక్కుమంటూ గడిపిన మాకు ఉదయాన్నే తెలిసింది, ఆ రాత్రి వీరప్పన్ ఓ పదిరోజులకి, పాతికమందికి సరిపడా వంట సరుకుల్ని దోచుకెళ్ళినట్లు.

ఎమ్.ఎమ్.హిల్స్ దగ్గర్లోనే వీరప్పన్ స్వగ్రామం గోపీనాథం అనే కుగ్రామం ఉంది. వీరప్పన్ తరుచూ తిరిగే అడవుల్లోకి, ఆటవిక గ్రామాలు, గూడేల్లోకి ధైర్యం చేసి బయలుదేరాం. చెరో రెండు కేజీలు ముగ్గుపొడిని తీసుకెళ్ళిన మేం అడవిలో దారితప్పకుండా, బయలుదేరిన చోటుకు తిరిగిరావటానికి వెళ్ళిన దారిలో ముగ్గు వేసుకుంటూ వెళ్ళాం. మధ్యాహ్నం వరకు రెండు గిరిజన గ్రామాలకు వెళ్ళి వివరాలు సేకరించుకున్నాం. వెనుదిరిగే సరికి మేం అడవిలో పోసుకుంటూ వచ్చిన ముగ్గు కనిపించలేదు. అంతకు ముందు కురిసిన వర్షానికి

అదిపోయింది. దాంతో దారి తప్పి రాత్రయినా అడవిలోంచి బయటకు వెళ్ళలేని భయంకరమైన స్థితి మాది. చిక్కటి చీకటీ, చలి... చిరుజల్లులు, క్రూరమృగాల అరుపులు... కాలం భారంగా గడిచిపోతోంది. రాత్రి పదకొండు గంటలకు ఏదో వెహికల్ హారన్ వినిపించింది. మేం రోడ్ పాయింట్‌కి దగ్గరలోనే ఉన్నాం అని అర్థమయింది. ఆ రాత్రంతా అక్కడున్నా ప్రమాదమే... మొండిగా హారన్ వినిపించిన దిశగా నడిచి ఎట్టకేలకు రోడ్ పాయింట్‌కి చేరుకున్నాం.

అది ఊటి, బండీపురా ఫారెస్ట్ నుంచి కేరళ వెళ్ళే రోడ్ రెండు మూడు వెహికల్స్ వెళ్ళినా, మమ్మల్ని చూసి భయపడి ఎవరూ ఆపలేదు. ఎట్టకేలకు రాత్రి ఒకటిన్నరకు టీ ఆకు తీసుకెళుతున్న ఓ ట్రాలర్ ఆగింది. అతను మమ్మల్ని జాగ్రత్తగా ఉండమని హెచ్చరించి లిఫ్ట్ ఇచ్చాడు. మరుసటి రోజు ఒక గుడ్డకొని దాన్ని పీలికలుగా చింపి అడవిలో ప్రయాణం చేస్తున్నప్పుడు వందడుగులకో పీలిక చొప్పున చెట్టుకు కట్టుకుంటూ వెళ్ళి, వచ్చేటప్పుడు విప్పుకుంటూ వచ్చేవాళ్ళం.

బండిపురా, మదుమలై, తితిమతి, స్వర్ణావతి, సత్యమంగళం, బర్గూరు, ఎం.ఎం.హిల్స్, నాగరహోలే, పాలార్ రివర్, కావేరి నది పరివాహక ప్రాంతం అడవుల్లో, హొగెనకలీ ఫాల్స్ అడవుల్లో మొత్తం నాలుగు దఫాలుగా వందరోజులకు పైగా తిరిగాం.

వీరప్పన్ గురించి రకరకాల వాస్తవాలు, కథనాలు, కల్పితాలు... ఎన్నో సేకరించుకున్నాను. ఓ రోజు వీరప్పన్ కుడిభుజమైన గంగైదొర అనూహ్యంగా కలిశాడు. అతనితో ఓ రోజంతా గడిపాను. అతను కొన్ని చెప్పి, మరికొన్ని దాచాడు. వీరప్పన్‌ని చూసే ధైర్యం ఉంటే తీసుకెళతానని, వీరప్పన్‌కి కాలులో క్రొరు గుచ్చుకుని సెప్టిక్ అయిందని, ఒక డాక్టర్‌ని కిడ్నాప్ చేసి తీసుకెళ్ళి ఆపరేషన్ చేయించామని, మందులు అవసరమైతే రాత్రే ఒక మెడికల్ షాప్‌ని దోచుకున్నామని చెప్పాడు.

సరిగ్గా ఆ సమయంలో మేమున్న చోటుకి కేవలం 4 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాడు వీరప్పన్. కాని మాకు ధైర్యం చాలలేదు. వెళ్ళుంటే తమిళ పత్రిక నకీరన్ కంటే నేనే వీరప్పన్‌ని ముందుగా ప్రపంచానికి పరిచయం చేసేవాడిని. అంతవరకు వీరప్పన్‌కి సంబంధించిన ఒక్క ఫోటో కూడా మీడియాకి, పోలీసులకి దొరకలేదు.



వీరప్పన్ అడవిలో వెళుతుండగా దూరం నుంచి తీసిన ఫోటో ఒకటి నాకు దొరికింది. ఈ నవలని స్వాతిలో సీరియల్‌గా ప్రారంభించిన నా గాడ్ ఫాదర్ స్వాతి బలరాం గారు ఈ ఫోటో వేస్తే చట్టపరమైన చిక్కులొస్తాయని వేయలేదు.

ఈలోపు మైసూర్ టైమ్స్, మైసూర్ మిత్ర 'ఎట్ లాస్ట్ దేరీజ్ ఏ నావల్ ఆన్ వీరప్పన్ ఫ్రమ్ ఏ ఫ్రంట్ లైన్ రైటర్ సూర్యదేవర' అని వార్త ప్రచురించారు.. నేను మైసూర్ రాగానే మైసూర్ జిల్లా రూరల్ ఎస్.పి. హరికృష్ణ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది.. ఇద్దరం ఓ రోజు లలిత మహల్ ప్యాలస్‌లో కూర్చున్నాం. వీరప్పన్ గురించి తెలిసిన వివరాలు చెప్పమని అడిగాడాయన.

'వీరప్పన్ పట్టించేంత వివరాలు నా దగ్గరలేవు' అని, నాకు తెల్సిన కొద్ది విషయాలు ఆయనతో పంచుకున్నాను. తర్వాత, హైదరాబాద్ వచ్చి నవల రాయటం మొదలుపెట్టాను. ఈ లోపు తరంగ అనే కన్నడ లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వారపత్రిక నుంచి ఫోన్ వచ్చింది. తమకూ సీరియల్ కావాలని... రెమ్యునరేషన్ ఎంతైనా ఇస్తామని.

నవల రాసింది రాసినట్లు ఒరిజినల్ కాపీ స్వాతికి పంపిస్తూ, జిరాక్స్ కాపీ తరంగకి పంపించటం ప్రారంభించాను. ఇటు తెలుగు స్వాతిలో, అటు కన్నడ తరంగలో ఒకే నెలలో ఒకేసారి సీరియల్‌గా రావటం ప్రారంభమైంది. దీన్ని కన్నడంలోకి అనువదించింది. శ్రీమతి సరితా జ్ఞానానంద్‌గారు.

దీంతోనే నాకు కన్నడంలో లక్షల్లో అభిమానులు సమకూరారు.

ఒక నవల ఒకేసారి రెండు భాషా పత్రికల్లో సీరియలైజ్ కావటం ఈ నవల విషయంలోనే జరిగింది.

ప్రమాదాలు, ఒక్కోసారి మృత్యువుకి అతిచేరువగా వెళ్ళటం అన్నది ఈ నవలతోనే రుచి చూశాను. ఆ తరువాత ఇది తమిళంలో కూడా వచ్చింది.

రక్తచందనం నేపథ్యం రెండవ భాగం - వచ్చే సంచికలో

suryadevaranovelist@gmail.com